# వణ్ణం పరమాత్మ

'కొండయ్య బావో....'

ఓరి...ఓరి.....ఓరి.... ఈడుండా... బావో ఇటు... ఇదేందిరీడూ సుబ్బరావా, సుబ్బరావా...ఏడ సచ్చినాడీడు.....కోక కనబడితే సాలు, కళ్ళు, సెవులు, నోరు అన్నీ తెరిసేసుకొని అట్లానే ఉండిపోతాడ్రా ఈడూ.... ఆరి సుబ్బరా... ఓర్నీ పక్కనే ఉండావా? అదేందిరా మూతి నల్లంగా బెట్టుకోనీ.... సరసవాడినా లేరా బామ్మరిదీ. ఇదిగో ఇట్టాంటి సిన్నయి పట్టించుకొంటే ఏడకుదురుద్దిరోయ్. ఓయమ్మో ఏవడీడు. ఇంత దెబ్బ తగల్నిచ్చినా వేందిరా కొండయ్యా. కొడుక్కి పెళ్ళి జేస్తుంటే మనిసికి పట్టపగ్గాల్లేకుండా అయిందే. ఏదీ మాయవ్వ... ఇదేందే సుబ్బరావమ్మా... ఇంత దొడ్డుగా అయినావేందే! సన్నంగా ములక్కాడ మాదిరి సెలాగ్గా తిరిగే దానివి. ఒసోస్ ఈ గుంట నీ సిన్న కూతురా. ఏందీ నా బుజాల కాడికి ఎదిగిందే! మొగోని మాదిర క్రాఫింగ్ ఏసుకోని

ఇప్పటికి రెండు తూర్లు అట్లా ఇట్లా పరిగెత్తి పోతావున్నా నేను గుర్తు పట్టనే లేదు తల్లీ! నువు సెప్పకపోతే ఇది మా కొండయ్యబావ కూతురని అనుకోనే అనుకోకపోదును.

నా సిన్న తనాన, నేను లాగూడదీసుకొని తిరిగే రోజుల్లో కొత్తోళ్ళు ఎవళ్ళు వచ్చినా 'ఈడు మన సింహాద్రిగాని కొడుగ్గదే' అని అడిగేవోళ్ళు గందంట్రా! మాయమ్మ సచ్చి ఏ లోకాన వుందో "అచ్చు నడిసొచ్చే ఎలిగ్గొడ్డు మాదిరి, మీ నాన్న పోలిక పుడితివి గదరా ఎర్రినాగన్న.... మరింక సింహాద్రి కొడుకు సింహాద్రి మాదిరి వుండడా ఏం కత! తండ్రి మటుకు పోతపోసిన దుక్క ఇనుము ఇగ్రహం లాగుంటే, కొడుకు సిమెంటు దిమ్మె మాదిరి ఎలాగుంటాడు" అని మురుసుకొనేది....

సెవటం మరిశానురా కొండయ్యా! ఇదేందిరా ఇంత గ్రాచ్చారం... మీ తాతా, అవ్వ ఆడ తపిస్తావుంటే, పెళ్ళికి ఆళ్ళని తోలకరాకుండా వద్దన్నావంటనే. ఆళ్ళకి నువు చేసే సొక్రం ఏందిరా పెత్తేకంగా!

ఆడ సూడు. సెవట్లు కారిపోతావుండాయా, రంధోళ్ళు మోగతా ఉన్నాయా. అయన్నీ సెవల్లో ఏసుకోకుండా, ఏకదీక్షగా తలంబ్రాలు పోసుకొంటూ సంబరం చేస్తావుంటెనే నీ కొడుకు. అడ్ని సిన్నకూనగా ఉన్నప్పటినుంచి ఆ ముసల్ది, మీ యమ్మ బుజాన్న ఏసుకొని సాకిండ్లా! ఆడికి పదేళ్ళప్పుడు కూడా ముసల్దాని గూళ్ళమీద ఎక్కి తిరిగే వోడె నీ కొడుకు. నీ ఆపీసరుద్యోగం నెమ్మదిగా వుండాలని పిల్లల్ని ముసల్ది సాదుకురాలా నువూ, నీ పెండ్లం.... రంగేళిగా దేశం తిరుగుతావుంటే, ఆ ముసలోడూ, ముసల్ది పిల్లకాయల్ని కంటికి రెప్పల్లా కాచుకొంటిరి గదరా కొండయ్య. ఏందిరోయ్ ముసిలోళ్ళతో నీకు ఇబ్బందంటవ్. వల్లకోరా.... ముసలి కాలాన కాళ్ళు సేతులు నీకూ నాకూ మటుకు తిన్నగా ఉంటాయా, ఏమన్నానా?

సర్లే అయ్యిందేదో అయింది గానీ పెళ్ళయినంక కొడుకునీ, కోడల్నీ పల్లెకు అంపి ముసిలోళ్ళ కాళ్ళకు మొక్కించు. ఆళ్ళ కళ్ళకి పండగ చేసినట్లయితంది. ఔన్రా కొండయ బావా సందట్లో పడి అసలూసు మరిసినా... కింద బండి దింపి వచ్చినా... ఎద్దులు బరువుకి గసపోస్తా వుంటాయి. బండినిండా మాయిడి పొళ్ళున్నాయి. కిందికి నలుగుర్ని అంపు. మంచి నికార్సయిన నూజీడు రసాలు ఒక్కో పొండు అరకేజీ ఉండాది. నిండా రసమే. వచ్చినోళ్ళకి రెండేసి పొళ్ళు వణ్ణాల్లో వడ్డించండిరోయ్. ఏందీ... పొళ్ళు అన్నాల్లో బావుండవా.... ఎవుడ్రా ఎర్రి నాకొడుకు అంతమాటన్నదీ... బోయినాల్లో సల్లటి క్రీము ఎడతారా.... అదేం కీరీము రెండు తూర్లు నాకితే సరిపోయే. నూజీడు రసాల్రా... పంచదార, తేనిపాకం తిన్నట్లుంటాదిరా... ఏందిరా నానుస్తా నిలబడుకోనీ?

ఒరే కొండయ్య గోచితో కుదర్దుగానీ.... లుంగీపైకి మడుసుకోనీ కిందికి పా... ఒరే... అప్పడాలోడా.... ఆ జల్లి బుట్టలో అప్పడాలు ఆడ గుమ్మరించి జల్లిబుట్ట ఇట్టా తేపా... సుబ్బా... ఏడీడు.... ఒరే కడుపాత్రం పెద్దమ్మ.... ఈడు అప్పుడే బంతిలో నోరు అప్పళిస్తా కూసున్నాడురా... సర్లేపా... ఆడి జఠరం పెద్దది. ఒరే అప్పడాలోడా ఇట్రా ఇట్రా... ఏంట్రా అలిగినావూ. ఏందీ నిన్ను రమేశ్ అనాల్నా.... అంటాల్నేరా గుంటపాపడా... మనకి నోరు తిరగద్దంటరా... తమాసకి నిన్ను అప్పడాలోడ్డిస్తున్నావు గదా! అని అప్పడాలోడా అన్నా... లేపోతే పులుసు పోస్తా వున్నావనుకో. పులుసోడా అంటా. లేపోతే దప్పళం ఇట్రా అంట...తమాసకిరా తమ్ముడా.... ఈ మాత్రానికే మనుషులు తినే పతార్తాలయి పోతార్రా... ఎర్రోడా... ఈ పెపంచకంలో సానామంది మనుషుల్లాగున్నా ఆళ్ళు మనకి తినే పతార్ధాల్లాగే కనిపించేస్తార్రా బాబూ... మన్లో మనమాట. నీకు దినకూలి ఎంతరా అప్పడాలూ... పదేనా.... నీకు రెండు పూట్లా కడుపు నిండేకి, తినేందికి ఈ డబ్బు సరిపోతాదిరా. ఇప్పుడు సెప్పు. నువు ఇంకోళ్ళ కళ్ళకి మనిషిలా వున్నావా, సప్పరించే మాత్రలాగున్నావా? మా సిన్న బంగారం. అద్దేరా మాపల్లికి అట్లా రా. రెండు పూట్లా రెండు సంగడి ముద్దలు సేతిలో పడినంకే కూల్డబ్బులు. మనిషి కడుపు నిందుకూ తినాలి గదా. సర్లేవో ఇది తర్వాత చూద్దారి. ఆ జల్లిబుట్ట ఇలాగందుకో. కిందికి పా... ఆడ బండ్లో నూజీడు రసాలున్నాయి. పైకి తేవాల పద పద...

ఏడ్రీడూ.... కొండయ్యా... ఓ కొండయ్యా బావో ఆ మూల గంగాళంలో నీళ్ళు పోయించు. కాయలు సుబ్బరంగా కడిగి వడ్డించాలా...ఓరి...ఓరోరి....ఎంకటాద్రి మావ కొడుకివ్ కదూ. ఎర్రోడివి, ఎర్రోడివే. నేన్రా సిన సిమ్మాద్రిని... ఏందీస దిక్కులు సూస్తాడు. మరిసినానోయ్ నువ్వేదో కలట్రవంటగా. అంతా అర్థవయింది. ఇదిగో అప్పడాలోడా. ఈడు మా సిన్నాయన మనవడు. సిన్నపుడు ఎర్రోడా అని పిలిచి ముద్దుకి బుజాన ఎక్కించుకొని మావిడి తోటన నడుస్తావుంటె పుటెక్కిన మామిడి పాళ్ళు తుంపేసేవాడు. బలే కంతిరోడ్రా. అరే.... కంతిరోడు కలక్టరయ్యి మొకం తిప్పుకొంటూ వుండాడు. సర్లేపా.... దారి దొలగండెహ. బుట్ట బరువున్నాది. మెట్లకాడ కాలు జారిద్దిరో అప్పడాలోడా....అర్రెరేయ్ ఏందిరో గోల.... వంట ముసిలమ్మ కూలబడిందిరా అప్పడాలూ.... నువ్వు ఆ బుట్ట పారేసి లగెత్తు... వత్తన్నా...నేనొత్తన్నాగా. ఏందె, ఇంత ముసిల్దాన్ని తోలుకొచ్చినారూ ఇంతింత గుండిగాలకాడ ఈ ముసిల్ది ఏం పనిచేస్తాదని తెచ్చినారూ. అయ్యో అట్టనా... కన్నబిడ్డలు కాదు పొమ్మంటవేంట్రా పాపం! కలియుగెం.

కలిమాయ, కన్నతల్లికి కడుపు కింత కూడు ఎట్టలేకపోవటం ఏంట్రా...మామ్మా కళ్ళు తెరవ్వే. ఇగ్గో నాపై పంచ ఈడ పరిసినా నిమ్మళంగా పండుకో తల్లే...ఎవఁరా నువ్వు.... వంట మేత్తిరివా. ఏందిరోయ్ దాని మీద ఎగర్తన్నావు. నీకు మీసాలుంటే నాకు భయం అనుకున్నావా ఏందీ? మొత్తం వంటయినాక ముసిల్ది కాస్త కళ్ళు తిరిగి కూలబడితే దాన్ని ఎల్లెల్లమని లేవగొట్టేందుకు నీకు మనసెట్ల గొచ్చిందిరా. నువ్వేం మొగాడివిరా. కల్లు దాగిన కోతికిమల్లే. ఏం అమర్యాదా మాటలు మాట్లాడినాను నేను. ముసిల్ది ఓపిక లేక గుడ్లు తేలేస్తే దాన్ని దోసేస్తావేందిరా నెలతక్కువ వెధవ. నువ్వుండరా కొండయ్యబావా. అయితే ఏందిరా. అలగి సొగం వంట ఎగ్గొట్టేసి పోతానంటావు. ఈ ముసిల్దన్నా ఉండాలా, నేనన్నా ఉండాలా అని సవ్వాల్ తీశావు గదరా! నువు ఐదే నిమిషాల్లో వంటసాల ఇడిసి పోకపోతే నీ కళ్ళు, కాళ్ళు నీయి గాదు. గుప్పెడు తిండికి గతిలేక, ముసిల్ది ఎత్తలేని బరువులు ఎత్తుకొనేందుకు వస్తే దాన్ని తన్ని తగలెయ్యమని నాకు నీతులు జెప్తావురా. ఇదిగో సుబ్బీ! ఈ వంటోడ్నీ, ఆడి గాంగునీ పొలిమేర కాడికి తరివేసిరా. అరె కొండయ్యా, వంట ఎల్లాగనీ నీకు బయ్యం వద్దురా. నేల్లేసురా.... వందెకరాల ఆసామిని. ఈడి తాతల్లాంటి వస్తాదులు సెవటోడ్చి నా పొలాన వళ్ళొంచి పనిచేస్తారు నాతోపాటు. మట్టిలో బంగారం పండించే ఆళ్ళకి లేని మంచి ఈడికేందిరా. అరె సుబ్బీ ఆ గెరెట ఇలాగందుకో. ఇదిగో కలఁటు దొరా. పోయి బంతిలో ధీమాగా కూసో. అరగంటలో అరవై మందికి అన్నం వడ్డించేస్తా. ఎందుకే వంట మామ్మా నాకు దణ్ణం ఎడతావు. నేనె నీ కొడుకిని అనుకో. వంటయినంక బండి గట్టుకు వచ్చినా, అందులో పారెళదాం. ఆడ మా వూళ్ళో..... నా పెళ్ళాం...నీకోడలు... నీకో ముద్ద పెట్టేందుకు ఎనకాడదులే. ఈ వయసులో ఇంకేవి కష్టం జేస్తావ్. మా యమ్మ యాదికొస్తా వుంది. మా ఇంటికాడ నిమ్మళంగా కూసో. మంచో... సెడ్డకో నీ కోడలికి సెప్తా వుండుపా... సుబ్బా ముసిలమ్మకి కాసిని మజ్జిగ చుక్కలు తాపించు. తేరుకుంటాది. దేగిసా ఇటు కుమ్మరిద్దాంరో... జాగరత... మెతుకు మట్టి పాలవకూడదు. తినే వణ్ణం పరమాత్మ అంటారు. ఏందీన గొణుగుతాడూ. పెళ్ళికి అందరిలాగా వచ్చి కూసోక ఈ పనులేటంటావా ఆ.... మనూర్లో..... మనం దరిజాగా లేవంటరా. అవసరపడినప్పుడు నడుం వంచకపోతే ఈడు సింహాఁద్రి కొడుకే కాదు. తేపోతే వంటోడు ముసిల్దాన్ని రొష్టు పెడతాఁడా– అన్నేయానికి మన్దగ్గర పప్పులుడకవురోయ్ వాజమ్మా. ఆ గరిటిట్టా అందుకో.... ※

*'సుఁప్రభాతం' వీక్లీ 8 జూన్ 1998*